ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5★ పెద్దపల్లి జిల్లా వార్తలు
మంగళవారం 22 అక్టోబరు 2024



ధాన్యం కొనుగోళ్లకు కట్టుదిట్టమైన చర్యలు
– కలెక్టర్ కోయ శ్రీ హర్ష
8


కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం
- ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్
8


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్

న్యూస్ బాక్స్

సుల్తానాబాద్ కోర్టు ఏజీపీగా దూడం అంజనేయులు

సుల్తానాబాద్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ)గా సీనియర్ న్యాయవాది దూడం అంజనేయులును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ న్యాయ కార్యదర్శి రేండ్ల తిరుపతి ఈ మేరకు ఉత్తర్వు నంబర్ 543 ద్వారా జారీ చేశారు. సోమవారం ఏజీపీగా అంజనేయులు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఏజీపీ అంజనేయులు జడ్జిని మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. బార్ అధ్యక్ష కార్యదర్శులు శ్రీరాములు, జోగుల రమేష్ తదితర న్యాయవాదులు అంజనేయులును సన్మానించారు

కొనుగోలు కేంద్రానికి స్థలం పరిశీలన

పెద్దపల్లి రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హన్మంతుని పేట గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు సోమవారం ఆర్డీవో గంగయ్య తహసీల్దార్ రాజ్‌కుమార్ స్థలాన్ని పరిశీలించారు. కోనుగోలు కేంద్రం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని గ్రామస్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే సూచన మేరకు ఆర్డీవో గంగయ్య, సర్వేయర్‌తో భూమిని సర్వే చేయించారు. సర్వే చేయించడంతో అటవీ శాఖ భూమి తేలినట్లు అధికారులు తెలిపారు. వారి వెంట కాంగ్రెస్ నాయకులు గన్నమనేని తిరుపతిరావు, గన్నబోయిన మల్లేశం, పోల్సాని సుధాకర్‌రావు, గుర్రాల వాసు, తీగల సతీష్, మాధవరావు, పడాల చంద్రయ్య, మేకల లక్ష్మణ్ ఉన్నారు.

వనరులు తరలుతున్నా.. నిధులు సున్నా..



జిల్లాలో గల ఖనిజ, ఇసుక, తదితర ప్రకృతి వనరులు తరలిపోతున్నా జిల్లాకు ప్రయోజనం లేకుండాపోతున్నది. వనరులను సద్వినియోగం చేసుకోవడం వల్ల ప్రభుత్వానికి చెల్లిస్తున్న సీనరేజీ పన్నుల నుంచి డీఎంఎఫ్‌టీ కింద జమ అవుతున్న నిధులు జిల్లాకు దక్కకుండా పోతున్నాయి. ఆయా సంస్థలు డీఎంఎఫ్‌టీ నిధులను నేరుగా ప్రభుత్వ ఖజానాకే జమ చేస్తున్నప్పటికీ, ఆ నిధులు జిల్లాకు బదలాయింపు కావడం లేదు. గత ప్రభుత్వ హయాంలో నిధులు రాకపోగా, ప్రస్తుత ప్రభుత్వం కూడా ఆ నిధులను విడుదల చేయకపోవడంతో జిల్లాలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు నిధుల కొరత ఏర్పడింది. ఐదేళ్ల నుంచి డీఎంఎఫ్‌టీ రూపేణా జిల్లాకు రావాల్సిన సుమారు 669 కోట్ల రూపాయలు రాకుండాపోయాయి. దీని పర్యావసానంగా జిల్లాలో చేపట్టిన కొన్ని పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి.

- ఐదేళ్లుగా జమ కానీ రూ. 669 కోట్ల డీఎంఎఫ్‌టీ నిధులు
- జిల్లాలో అభివృద్ధి పనులకు నిధుల కొరత
- మంత్రి, ఎమ్మెల్యేలు ఒత్తిడి పెంచితేనే నిధులు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

జిల్లాలోని గోదావరిఖని, రామగుండం, రామగిరి, కమాన్‌పూర్, మంథని వరకు బొగ్గు గనులు విస్తరించి ఉన్నాయి. కొన్ని అండర్ గ్రౌండ్ బొగ్గు గనులు ఉండగా, మరికొన్ని ఓపెన్ కాస్ట్ గనులు ఉన్నాయి. అలాగే పాలకుర్తి మండలంలో సున్నం రాయి గుట్టలు ఉండగా, వాటిని సిమెంట్ తయారీ పరిశ్రమకు లీసుకుఇచ్చారు. జిల్లాలో గోదావరి, మానేరు నదులు పారుతుండగా ఇసుక రీచులు నడుస్తున్నాయి. ఈ వనరులను తరలించుకు పోయేందుకు ప్రభుత్వానికి సీనరేజీ సొమ్మును చెల్లిస్తూ ఉంటారు. ఈ సొమ్మును గతంలో స్థానిక సంస్థలకు వాటాల ప్రకారం బదలాయిస్తే, ప్రభావిత ప్రాంతాల అభివృద్ధి కోసం వెచ్చించే వాళ్లు.

● 2015లో డీఎంఎఫ్‌టీ ఏర్పాటు..

2015లో కేంద్ర ప్రభుత్వం డిస్ట్రిక్ట్ మినరల్ ట్రస్టు ఫండ్ (డీఎంఎఫ్‌టీ)ను తీసుకువచ్చింది. ప్రభుత్వానికి చెల్లించే సీనరేజీ నుంచి 30 శాతం నిధులను డీఎంఎఫ్‌టీకి జమ చేయాల్సి ఉంటుంది. ఆ విధంగా జమ అయిన నిధులను ప్రభావిత ప్రాంతాల అభివృద్ధి కోసం వెచ్చించాల్సి ఉంటుంది. డీఎంఎఫ్‌టీకి 2018 వరకు సుమారు 713 కోట్ల రూపాయలు జమ అయ్యాయి. కేంద్రం తీసుకువచ్చిన జీవోకు అనుబంధంగా ఈ నిధులను ఉమ్మడి జిల్లా అంతటా వెచ్చించాలని అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం జీవోను తీసుకు వచ్చింది. ఆ మేరకు 2018లో మొదట ఉమ్మడి జిల్లాలోని 13 నియోజకవర్గాల్లో 8,106 పనులకు గాను 559 కోట్ల 22 లక్షల రూపాయలు మంజూరు చేశారు. అందులో భాగంగా పెద్దపల్లి జిల్లాలో 1,807 పనులు చేపట్టేందుకు 252 కోట్ల 23 లక్షలు మంజూరు చేశారు. అలాగే కొవిడ్ సమయంలో 2020లో రాష్ట్ర ప్రభుత్వం 198 కోట్ల రూపాయలు తీసుకోగా, ఆ తర్వాత కూడా మరొకసారి 123 కోట్ల రూపాయలను మళ్లించడం గమనార్హం. సీఎంవో నుంచి వచ్చిన ఆదేశాలతో జగిత్యాల జిల్లాకు 23 కోట్లు, రాజన్న సిరిసిల్ల జిల్లాకు 31 కోట్ల 92 లక్షలు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు 18 కోట్ల రూపాయలను జిల్లా అధికారులు కేటాయించారు. మొత్తంగా 13

మిగతా 8వ పేజీలో...

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

సుల్తానాబాద్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సమాజంలో అన్నిరంగాల వారు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, తద్వారా నేరాలు చట్టాలు తదితర అంశాలపై అన్ని విషయాలు తెలిసి నేరాలను నియంత్రించవచ్చని సుల్తానాబాద్ జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేష్ అన్నారు. సుల్తానాబాద్ మండంలోని చిన్నకలువల గ్రామంలో న్యాయ సేవాధికార సంస్థ అధ్వర్యంలో సోమవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జితో పాటు పలువురు న్యాయవాదులు పలు చట్టాల గురించి ప్రజలకు వివరించారు. న్యాయ సేవాధికార సంస్థ ద్వారా గ్రామీణ ప్రాంతాల పేదలకు కూడా ఉచిత న్యాయసేవలు అందిస్తున్నామన్నారు. అవసరమైన వారు సుల్తానాబాద్ కోర్టులో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పడాల శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి జోగుల రమేష్, ఏజీపీ దూడం అంజనేయులు, లోక్ అదాలత్ సభ్యుడు ఆలూరి శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరు నమోదుపై అవగాహన

సుల్తానాబాద్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గ అశావహ ఎమ్మెల్సీ అభ్యర్థి యాదగిరి శేఖర్ రావు ఓటరు నమోదు గురించి పట్టభద్రులకు అవగాహన కల్పించారు. సోమవారం స్థానిక ఇండియన్ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన సమావేశంలో ప్రైవేట్ విద్యాసంస్థల కరస్పాండెంట్లు, పట్టభద్రులు పాల్గొన్నారు. ఓటు ఎలా నమోదు చేసుకోవాలో వివరించారు. తనను ఎమ్మెల్సీ గెలిపించాలని శేఖర్‌రావు వారిని అభ్యర్థించారు. కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కేశవరెడ్డి, సెక్రెటరీ బుచ్చిరెడ్డి, రాష్ట్ర నేతలు శ్రీనివాస్, ఐపీఎస్ కరస్పాండెంట్ సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

'మహిళా శక్తి' క్యాంటీన్ ప్రారంభం


క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ అవరణలో మహిళా శక్తి క్యాంటీన్‌ను ఎమ్మెల్యే విజయరమణారావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా అభివృద్ధి పరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళల కోసం అమలు చేస్తున్న పథకాలు వాటి ప్రయోజనాల గురించి ఎమ్మెల్యే వివరించారు. ఈసారి కూడా ధాన్యం కొనుగోలు విషయంలో ఎలాంటి కోతలు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల వారు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీరాజమల్లు, కౌన్సిలర్లు, ఐకేపీ బీపీఎం రజని, ఏపీఎంలు శ్రీనివాస్, గీత, సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, నాయకులు నాయకులు మినుపాల ప్రకాష్ రావు, రాజలింగం, జానీ, బండారి రమేష్, మహిళా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం

ఓదెల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రూపు నారాయణపేట మానేరు వాగుపై రూ. 80 కోట్ల వ్యయంతో వంతెన నిర్మాణానికి మంజూరు కావడంతో పొత్కపల్లిలో కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు చిత్రపటానికి సోమవారం క్షీరాభిషేకం నిర్వహించారు. అంతకుముందు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేమ్‌సాగర్‌రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే ఇచ్చిన హామీ మేరకు మానేరు వంతెన సమస్య కొద్ది రోజుల్లోనే తీరుతుందని అన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ ఆళ్ల సుమన్ రెడ్డి, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు అంబాల కొమురయ్య, మాజీ సర్పంచులు ఆకుల మహేందర్, అంకం రమేష్, బొంగోని రాజయ్య గౌడ్, పడాల రాజు, మాజీ ఉపసర్పంచ్ గిరాం సాంబమూర్తి, సింగిల్ విండో డైరెక్టర్లు, చింతం కుమారస్వామి, బొంగోని శ్రీనివాస్, మాజీ ఎంపీటీసి నీర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అమరుల స్ఫూర్తితో.. ప్రజలకు మరింత సేవచేయాలి

- పోలీసులు లేని సమాజాన్ని ఊహించలేము

- సీపీ శ్రీనివాస్

కోల్‌సిటీ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణలో ప్రాణత్యాగం చేసి అమరుల స్ఫూర్తితో ప్రజలకు మరింత సేవ చేయాలని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా అమర జవాన్లకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ పోలీసులు లేని సమాజాన్ని ఊహించలేమని, వ్యవస్థ సాఫీగాసాగడంలో పోలీసులది కీలకపాత్ర అన్నారు. మావోయిస్టులతో, అసాంఘిక శక్తులతో జరిగిన పోరులో అమరులైన పోలీసుల త్యాగాలు మరువలేనివని పేర్కొన్నారు. ప్రాణం కంటే ప్రజలు, దేశ రక్షణ, విధి నిర్వహణ గొప్పదని చాటిన అమరుల త్యాగాలు చిరస్మరణీయమన్నారు. వారి త్యాగాలను స్మరించుకునేందుకే సంస్మరణ దినోత్సవం నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ సరిహద్దు రక్షణలో జవాన్లు పనిచేస్తే సమాజ రక్షణలో పోలీసులు పనిచేస్తున్నారన్నారు. నిత్యం పోలీసులు ప్రజలకు అందు బాటులో ఉంటూ సేవలందిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా అమరుల కుటుంబాల సభ్యులు తమ సమస్యలను వారు సీపీ, అధికారులు దృష్టికి తీసుకువచ్చారు.

● అమరులకు ఘన నివాళులు..

విధి నిర్వహణలో అమరులైన పోలీసులకు రామగుండం కమిషరేట్‌లో ఘనంగా నివాళులర్పించారు. రామగుండం సీపీ శ్రీనివాస్, మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్, డీసీపీ చేతన అమరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛం అందించి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్ఎఫ్‌సీఎల్ సీజీఎం ఉదయరాజహన్స్, డీజీఎం(హెచ్ఆర్) సోమనాథ్, సింగరేణి పర్సనల్ మేనేజర్ కిరణ్ బాబు, సెక్యూరిటీ ఆఫీసర్ వీరారెడ్డి, ఎస్‌బీ ఏసీపీ రాఘవేంద్రరావు, గోదావరిఖని ఏసీపీ రమేష్, పెద్దపల్లి ఏసీపీ జీ కృష్ణ, మంచిర్యాల ఏసీపీ ఆర్ ప్రకాష్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, రామగుండం ట్రాఫిక్ ఏసీపీ నర్సింహులు, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మల్లారెడ్డి, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, సుందర్‌రావు, ఏఓ అశోక్‌కుమార్, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు బోర్లకుంట పోచలింగం, సిబ్బంది పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న అమరుల కుటుంబ సభ్యులు


జ్యోతి వెలిగిస్తున్న సీపీ శ్రీనివాస్, మంచిర్యాల కలెక్టర్

ప్రభుత్వం ఇచ్చిన భూమిని కబ్జా చేశారు..

- సీపీకి హోం గార్డ్ ఎర్రోజు స్వామి సోదరి మొర

తన తమ్ముడు హోంగార్డు ఎర్రోజు స్వామిని 1985లో నక్సలైట్లు చంపారు. అతనికి పెళ్లి కాలేదు. ప్రభుత్వం కుటుంబ పోషణార్థం అందుగుల పల్లె సమీపంలో ఐదు ఎకరాల వ్యవసాయ భూమిని ఇచ్చింది. సోదరినైన నేనే కుటుంబాన్ని పోషించాను. ప్రభుత్వం ఇచ్చిన భూమిని ఒక వ్యక్తి కబ్జా చేశాడు. చాలా కాలంగా అధికారుల చుట్టూ తిరుగుతున్నాను. ఏండ్లు గడుస్తున్నా ఎవరూ స్పందించడం లేదు. మాభూమిని మాకు ఇప్పించండంటూ నక్సలైట్ల కాల్పులో చనిపోయిన ఎర్రోజు స్వామి సోదరి అబ్బోజు లక్ష్మి రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్‌తో మొరపెట్టుకున్నది. దీనిపై స్పందించిన సీపీ సమస్యను పరిష్కరించాలని డీసీపీ చేతనకు సూచించారు.

ప్రభుత్వం ఇచ్చిన భూమి రైల్వేలో పోయింది..

సీహెచ్ మనీల, ఏఎస్సై మదన్‌మోహన్ కుమార్తె

ఏఎస్సై మదన్‌మోహన్ మంచిర్యాల పట్టణంలో నక్సలైట్ల కాల్పుల్లో 1998లో మృతి చెందారు. అతని కుటుంబానికి ప్రభుత్వం మంచిర్యాల రైల్వే ట్రాక్ సమీపంలో 70 గజాల ఇంటి స్థలాన్ని కేటాయించింది. ఆస్థలాన్ని రైల్వే ట్రాక్ విస్తరణలో రైల్వే శాఖ తీసుకున్నది. తమకు ప్రత్నామ్నాయ స్థలాన్ని ఇప్పించాలని ఏఎస్సై మదన్‌మోహన్ కుమార్తె మనీల రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్‌ను కోరింది. దీనిపై తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా సీపీ శ్రీనివాస్ కలెక్టర్ కుమార్‌దీపక్‌ను కోరారు.

దళితుల ఐక్యత కోసం మహా పాదయాత్ర

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా దళితుల ఐక్యత కోసం మాలల మహా పాదయాత్రను చేపడుతున్నట్లు జై భీమ్ సైనిక్ దళ్ జిల్లా అధ్యక్షుడు కట్టేకోల మధు అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట మహాపాదయాత్ర పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ ఈ నెల 25 నుంచి డిసెంబరు 1 వరకు భద్రాచలం నుంచి హైదరాబాద్ వరకు జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ మహా పాదయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. పెద్దపల్లి జిల్లా కేంద్రానికి నవంబర్ 11 న పాదయాత్ర చేరుకుంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో గీసా రాజు, కాసార్ల సాంబశివరావు, మాదాసు చంద్రు, ప్రభాకర్, మహేందర్, అంబటి లక్ష్మీనారాయణ, రామ్మూర్తి, కుమారస్వామి పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాల తనిఖీ

ముత్తారం అక్టోబరు 21: (ఆంధ్రజ్యోతి) మండల కేంద్రంలోని కస్తూర్బా ఆశ్రమ పాఠశాలను ఎంపీడీవో సురేష్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షలు రాస్తున్న విద్యార్థుల వద్దకు వెళ్లి తనిఖీ చేశారు. నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నారా లేదా అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నం భోజనం విద్యార్థులతో పాటు చేపట్టారు. శానిటేషన్ పనులు పాఠశాల ఆవరణలో చేయించి విద్యార్థులకు అంటు వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టారు.

ముప్పిరితోటలో గాలికుంటు వ్యాధిటీకాలు

ఎలిగేడు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పిరితోటలో సోమవారం పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో 136 పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు పశువైద్యులు ర్యూన్సీ తెలిపారు. నివారణ టీకాలు ఉచితంగా వేస్తున్నామని పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు. పశుమిత్ర సమ్మయ్య, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జీవో నంబర్ 29 రద్దు చేసి గ్రూప్-1 అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బీజేవైఎమ్ ఆధ్వర్యంలో పట్టణంలోని కమాన్ చౌరస్తాలో సోమవారం ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ బీజేవైఎం నాయకులు మాట్లాడుతూ టీజీపీఎస్సీ నియమాలకు విరుద్ధంగా ప్రభుత్వం గ్రూప్-1 లో ఓబీసీలు, ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం చేస్తూ కేవలం ఓసీలకు మాత్రమే న్యాయం చేసేలా వచ్చిన జీవో నెంబర్ 29 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు షీలారపు పర్వతాలు అసెంబ్లీ కన్వీనర్ దాడి సంతోష్, పట్టణ అధ్యక్షుడు కావేటీ రాజగోపాల్, మండల అధ్యక్షుడు మేకల శ్రీనివాస్, ఈర్ల శంకర్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉప్పు కిరణ్, కృష్ణ వంశీ, ఉమేష్, మండల ఎర్రల్ల శ్రీకాంత్, మండల ప్రధాన కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు

సామాజిక అంశాలపై అవగాహన

కమాన్‌పూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు షీ టీం ఆధ్వర్యంలో వివిధ సామాజిక అంశాలపై సోమవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా షీ టీం మెంబర్ స్నేహలత మాట్లాడుతూ ఆన్‌లైన్ మోసాల భారిన పడి మోసపోవద్దన్నారు. మత్తు పదార్థాల బారినపడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. కాలేజీల వద్ద ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే 6303923700 నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. ఆన్‌లైన్ మోసాలకు గురైతే వెంటనే హెల్ప్‌లైన్ నంబర్ 1930కి సమాచారం ఇవ్వాలన్నారు. సమావేశంలో ఏఎస్ఐ మల్లన్న, ప్రిన్సిపాల్ సుధాకర్, షీ టీం సిబ్బంది సురేష్ ఉన్నారు.

క్రైం కార్నర్

భార్యను వేధించిన భర్తకు ఏడాదిన్నర జైలు

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): భార్యను వేధించిన భర్తకు ఏడాదిన్నర జైలు శిక్షతోపాటు రూ.10వేల జరిమానా విధిస్తూ సోమవారం సిరిసిల్ల ప్రథమశ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ తీర్పు వెల్లడించారు. దోమకొండ మండలం తుల్జాపూర్‌కు చెందిన సుంకరి రాజుకు ముస్తాబాద్ మండలం గూడెం గ్రామానికి చెందిన మేఘమాలతో 2010లో వివాహం జరిగింది. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. కొంతకాలం తర్వాత అదనపు కట్నం తీసుకురావాలని భర్త వేధింపులకు గురిచేశాడు. 2015లో ముస్తాబాద్ పోలీస్ స్టేషన్‌లో భర్త రాజుపై ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్సై మారుతి కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. పీపీ సందీప్ వాదించగా ముస్తాబాద్ ఎస్సై గణేశ్, సీఎంస్ ఎస్సై రవీందర్‌నాయుడు, కోర్టు కానిస్టేబుల్ దేవేందర్ ఏడుగురు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. నిందితుడు సుంకరి రాజుపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ప్రవీణ్ తీర్పు చెప్పారు.

గంభీరావుపేటలో యువకుడి అదృశ్యం

గంభీరావుపేట, అక్టోబర్ 21: (ఆంధ్రజ్యోతి) గంభీరావుపేట మండల కేంద్రంలోని దోసల గూడెంకాలనీకి చెందిన బరిగెల బాబు అనే యువకుడు అదృశ్యమయ్యాడు. ఈ నెల 19న ఇంటి నుంచి వెళ్లిన బాబు తిరిగి రాలేదు. బాబు కోసం మూడు రోజులుగా కుటుంబ సభ్యులు వెతుకుతున్నారు. ఆచూకీ లభ్యం కాక సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

అనారోగ్యంతో 'కేశోరాం' కార్మికుడి ఆత్మహత్య

పాలకుర్తి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కేశోరాం వర్కర్స్ కాలనీలో నివాసముంటున్న కంపెనీ కార్మికుడు ఆదివారం రాత్రి ఉరేసుకొని మృతి చెందినట్లు బసంత్‌నగర్ ఎస్ఐ ఆర్ స్వామి తెలిపారు. ఎస్ఐ సోమవారం వివరాలను వెల్లడించారు. కన్నం కేశవులు(55) కంపెనీలో పర్మినెంటు వర్కర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కొన్ని రోజులుగా బీపీ, షుగర్, ఇతర అనారోగ్య సమస్యలతో విధులకు సరిగా హాజరు కాలేదు. దీంతో మనోవేదనకు గురై తన క్వార్టర్‌లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు కేశవులు తండ్రి కన్నం నాగయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ తెలిపారు. ఆదివారం బసంత్‌నగర్ తెలుగు మీడియం పాఠశాలలో జరిగిన పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఆయన అదే రోజు రాత్రి ఆత్మహత్య చేసుకోవడంతో విషాదఛాయలు అలుముకున్నాయి.

జీవితంపై విరక్తితో వృద్ధుడి ఆత్మహత్య

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు, 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జగ్గాసాగర్ గ్రామంలో జీవితంపై విరక్తి చెంది ఓ వృద్ధుడు సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కుమ్మ వెంకన్న(65) వృద్ధుడు కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కొంత కాలం నుంచి మద్యానికి బానిసయ్యాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది సోమవారం మధ్యాహ్నం గ్రామంలోని స్వంత కొట్టంలో దులానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య దేవవ్వ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆస్పత్రికి వెళ్లి వస్తుండగా రోడ్డు ప్రమాదం

- తండ్రీ కొడుకులకు తీవ్ర గాయాలు

సుల్తానాబాద్, అక్టోబర్ 21 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న తండ్రిని ఆసుపత్రిలో చూపించి తిరిగి ఇంటికి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో తండ్రీ కొడుకులిద్దరూ తీవ్రంగా గాయపడిన సంఘటన సుల్తానాబాద్ మండలంలోని భూపతిపూర్ స్టేజీ వద్ద రాజీవ్ రహదారిపై సోమవారం జరిగింది. పెద్దపల్లి మండలంలోని గౌరెడ్డిపేటకు చెందిన మల్లేశంను ఆస్పత్రిలో చూపించడం కోసం ఆయన కొడుకు మధునయ్య బైక్‌పై కరీంనగర్ వెళ్లారు. తండ్రిని అస్పత్రిలో చూపించి మందులు తీసుకుని తిరిగి సోమవారం రాత్రి స్వగ్రామానికి వస్తుండగా వీరి బైక్‌ను వెనక నుంచి వేగంగా వస్తున్న ఇసుక లారీ భూపతిపూర్ స్టేజీ వద్ద రాజీవ్ రహదారిపై ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తండ్రికి కుడి కాలు తెగిపడిపోగా, కొడుకకు కాళ్లకు చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని వెంటనే కరీంనగర్ అస్పత్రికి అంబులెన్సులో తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ ఆగకుండా వెళ్లిపోయిందని గ్రామస్థులు తెలిపారు.

భూమి అమ్మి మోసం చేసిన వారిపై కేసు

వీణవంక, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): భూమి అమ్మి కొంత భూమి రిజిస్ట్రేషన్ చేసి మిగతా భూమి రిజిస్ట్రేషన్ చేయకుండా మోసం చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. హిమ్మత్‌నగర్ గ్రామస్థుడైన మేక రమేష్‌కు కరీంనగర్‌కు చెందిన అన్‌రెడ్డి ప్రకాష్‌రెడ్డి అన్‌రెడ్డి అరుణ వారికున్న ఏడెకరాల 19 గుంటలు రూ. 71 లక్షల 50 వేలకు అమ్ముతామని నమ్మబలికి మొత్తం రూపాయలు ముట్టిన తర్వాత ఐదు ఎకరాల 32 గుంటలు మాత్రమే పట్టా చేశారని తెలిపారు. మిగతా భూమిని పట్టా చేయకుండా ఇబ్బందులు పెడుతున్నారని, రిజిస్ట్రేషన్ చేయమని అడిగితే చంపుతామని బెదిరిస్తున్నారని, తన వద్ద పైసలు తీసుకొని మోసం చేశారని మేక రమేష్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

అనుమానాస్పదంగా ఒకరి మృతి

వెల్గటూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముక్కట్రావుపేట గ్రామానికి చెందిన మేకల రాజయ్య(40) అనే వ్యక్తి సోమవారం అనుమానాస్పదంగా మృతి చెందినట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు రాజయ్య కొద్ది కాలంగా మద్యానికి బానిసయ్యాడు. సోమవారం ఉదయం ఇంటిలో అనుమానాస్పదంగా మృతి చెంది ఉన్నట్లు కుటుంబీకులు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుడి సోదరుడు మేకల మహేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. మృతికి గల కారణాలు తెలుసుకోవడానికి శవాన్ని పంచనామా నిమిత్తం జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

యువకుడి అదృశ్యం

ఫైటింక్లయిన్‌కాలనీ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పోతనకాలనీకి చెందిన మంథని ప్రవీణ్‌కుమార్ (29) అదృశ్యమైనట్టు గోదావరిఖని టూటౌన్ పోలీసులు తెలిపారు. 2 ఇంక్లయిన్ గనిలో పనిచేస్తున్న ప్రవీణ్‌కు ఇటీవల నిశ్చితార్థం జరిగింది. బంధువు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు ఊరికి వెళ్లి సోమవారం తెల్లవారు జామున ఇంటికి వచ్చే సరికి ప్రవీణ్ కనిపించలేదు. ప్రవీణ్ మొబైల్ స్విచ్ ఆఫ్ రావడంతో ఇరుగు పొరుగు వారికి, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. ప్రవీణ్ తండ్రి మంథని రాజయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

గంజాయి కేసులో ఒకరి అరెస్ట్

చందుర్తి, కోనరావుపేట, అక్టోబర్ 21 (ఆంధ్రజ్యోతి) : గంజాయి సరఫరా కేసులో పరారీలో ఉన్న ఒకరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. కోనరావుపేట మండలం సుద్దాల గ్రామ శివారులో జూలై 25న కావేరి కాటన్ మిల్ వద్ద గంజాయి సరఫరా చేస్తున్న ఏడుగురిపై కేసు నమోదైంది. వారిలో ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్ పంపారు. ఈ కేసులో మర్తనపేట గ్రామానికి చెందిన నీరటి సాయికుమార్ పరారీలో ఉండగా సోమవారం రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

91 గ్రాముల గంజాయి స్వాధీనం

మంథని, అక్టోబర్ 21: స్థానిక బస్ డిపో సమీపంలో మంథనిలోని పోచమ్మవాడకు చెందిన కుడుదుల సూర్యవర్ధన్‌అనే యువకుడి వద్ద నుంచి 91 గ్రాముల ఎండు గంజాయిని సోమవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. తమకు అందిన సమాచారంతో తాము బస్ డిపో సమీపంలో చూడగా సూర్యవర్ధన్ అనుమానాస్పదంగా ఉండి తమను చూసి పారిపోయేందుకు ప్రయత్నించగా పట్టుకొని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అతని వద్ద ఉన్న ప్లాస్టిక్ కవర్ తనిఖీ చేయగా 91 గ్రాముల ఎండు గంజాయి ఉన్నట్లు గుర్తించామన్నారు. మహారాష్ట్రలోని చంద్రపూర్ వెళ్లి తనకు పరిచయం ఉన్న కీర్తిక్ అనే వ్యక్తి దగ్గర గంజాయి కొనుగోలు చేసినట్లు సూర్యవర్ధన్ వెల్లడించారన్నారు. తన వద్ద ఉన్న గంజాయిని స్థానిక శ్రీపాదకాలనీలో తనకు పరిచయస్థులైన తైడల సురేష్, పెండ్యాల సునీల్, ఆసంపెల్లి తరుణ్, లక్క రవివర్మలతో కలిసి గత కొంత కాలంగా గంజాయిని తాగున్నట్లు సూర్యవర్ధన్ వెల్లడించినట్లు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



రైతు నేస్తం..

వ్యవసాయ అభివృద్ధి, రైతుల శ్రేయస్సే ధ్యేయంగా జగిత్యాల జిల్లాలోని పొలాస వ్యవసాయ పరిశోధన స్థానం పనిచేస్తోంది. వ్యవసాయ రంగంలో ఉత్తర తెలంగాణకు పొలాల క్షేత్రం తలమానికంగా నిలుస్తోంది. ప్రొఫెసర్ జయశంకర్ రాష్ట్ర వ్యవసాయ విశ్వ విద్యాలయానికి అనుబంధంగా వ్యవసాయ కళాశాలను ఏర్పాటు చేశారు. కళాశాలలో బీఎస్సీ, ఎమ్మెస్సీ అగ్రికల్చర్ స్పెషలైజేషన్, జెనెటిక్స్ తదితర కోర్సులను అందిస్తున్నారు. ఇక్కడ కోర్సు పూర్తి చేసుకున్న పలువురు విద్యార్థులు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో పలు ప్రైవేటు, ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. ఇక్కడ తయారైన పలు రకాల విత్తనాలు రాష్ట్ర స్థాయిలో ప్రాచుర్యం పొందాయి. ఎప్పటికప్పుడు అధిక దిగుబడిని అందించే కొత్త కొత్త వంగడాలను సృష్టిస్తూ పరిశోధన స్థానం తనదైన ప్రత్యేకతను చాటుకుంటోంది.

పొలాస క్షేత్రం

ఉత్తర తెలంగాణకు తలమానికంగా వ్యవసాయ కేంద్రం

- అనుబంధంగా వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల
- వ్యవసాయ డిగ్రీ, పీజీ కళాశాలలు



జగిత్యాల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పొలాస ప్రాతీయ వ్యవసాయ పరిశోధన క్షేత్రా నికి ప్రత్యేక స్థానం ఉంది. 1983 సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు పరిశోధన స్థానాన్ని ప్రారంభించారు. సుమారు 48.96 హెక్టార్ల విస్తీర్ణంలో పరిశోధన స్థానం ఉంది. ఈ కేంద్రం పరిధిలో కరీంగనర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల పరిశోధన క్షేత్రాలు, కృషి విజ్ఞాన కేంద్రాలు, ఏరువాక కేంద్రాలు పనిచేస్తున్నాయి. ఈ పరిశోధన స్థానం తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాలకు చెందిన రైతులకు అవసరమైన సేవలు అందిస్తోంది. కళాశాల నూతన వంగడాలపై పరిశోధనలు చేస్తూ, రైతులకు సాగులో మెళకువలు చెప్తూ, సలహాలు, సూచనలను ఎప్పటికప్పుడు అందిస్తూ రైతు నేస్తంగా పొలాస వ్యవసాయ పరిశోధన క్షేత్రం కృషి చేస్తోంది. పలు ఆటు పోట్లను అధిగ మిస్తూ ప్రస్తుతం రాష్ట్రంలోనే అత్యంత ఉత్తమ ప్రదర్శన క్షేత్రంగా ఖ్యాతి గడించడం పట్ల జిల్లా రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


వ్యవసాయ ప్రయోగాలు చేస్తున్న ప్రొఫెసర్లు, విద్యార్థులు

అనుబంధ కళాశాలలు ఇవీ..

పొలాస వ్యవసాయ పరిశోధన స్థానానికి అనుబంధంగా 2008 సంవత్సరంలో వ్యవసాయ డిగ్రీ కళాశాల, 2013లో వ్యవసాయ పీజీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాలలు ఏర్పాటు అయ్యాయి. వ్యవసాయ కళాశాలలో 150 సీట్లు, పీజీలో 14 సీట్లు ఉన్నాయి. ఈ కళాశాలలో ప్రవేశం పొందు తున్న వారిలో అధికంగా బాలికలు ఉంటున్నారు. బీఎస్సీ అగ్రికల్చర్ కళాశాల ప్రారంభం అయ్యింది. పక్కా భవనం లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్న విద్యార్థులకు రూ. 20 కోట్లతో పక్కా భవనం నిర్మించడంతో సమస్య సద్దుమణిగింది. ప్రస్తుతం వ్యవసాయ కళాశాలలో ప్రతీ యేటా సుమారు 150 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందుతున్నారు. ఒకే ప్రాంగణంలోనే వ్యవసాయ డిగ్రీ, పీజీ కళాశాల, పాటిటెక్నిక్ కళాశాల ఉండడం వ్యవసాయ విద్యావ్యాప్తికి దోహదపడుతోంది.

తొలినాళ్లలో అవస్థలు, అసౌకర్యాలతో ఇబ్బందులు పడ్డ పరిశోధన స్థానం నేడు అన్ని హంగులతో వ్యవ సాయరంగంలో ఒక వెలుగు వెలుగుతూ రైతన్నలకు పరిశోధన ఫలాలు పంచుతూ జిల్లాకే తలమాణికంగా నిలుస్తోంది. కార్యాలయ నిర్వహణతో పాటు, పరిశోధనలకు సైతం ఊతం ఇస్తూ వంగడాల ఉత్పత్తిలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ముందు వరుసలో ఉన్నారు. ఏటా విత్తన మేళా నిర్వహించి రైతులకు అవసరమైన విత్తనాలను అందిసున్నారు.

అధిక దిగుబడినిచ్చే విత్తనాల కోసం..

ప్రధానంగా జిల్లాకు ఆయువుపట్టుగా ఉన్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కింద పండే పంటలైన వరి,


క్షేత్ర స్థాయి వ్యవసాయ పనుల్లో కళాశాల విద్యార్థులు

మొక్కజొన్న, నువ్వులు, వేరుశనగ పంటలకు సంబంధించి అధిక దిగుబడినిచ్చే విత్తనాలు, కీటకాలు, చీడ పీడలను, వాతావరణ పరిస్థితులను తట్టుకొని నిలబడి, రైతుకు లాభాలు ఇచ్చే పంటల విత్త నాలను పరిశోధన కేంద్రంలో కనిపెడుతున్నారు. వీటిని రైతులతో పాటు ప్రభుత్వం ద్వారా ప్రైవేటు విత్తన సంస్థలకు అందజేస్తారు. జగిత్యాల పరిశోధన స్థానంలో తయారైన పలు వరి, మొక్కజొన్న, నువ్వు విత్తనాలు రాష్ట్ర స్థాయిలో ప్రాచుర్యం పొందాయంటే పరిశోధనల ఫలితం, శాస్త్రవేత్తల కృషికి అద్దం పడుతున్నాయి.

మేలైన వంగడాలకు కేరాఫ్‌గా...

రైతులెంత చెమటోడ్చినా వేలకు వేలు పెట్టుబడి పెట్టిన దిగుబడి లేక నష్టాల్లో దిగబడి పోతున్నారంటే నాణ్యమైన వంగడాలు అందక పోవడమే కారణం అని భావిస్తున్నారు. ఈ సమస్యను అధిగమించడం పై పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు దృష్టి సారించారు. వరి ప్రధాన పంటగా సాగుచేస్తున్న తెలంగాణ రాష్ట్రంలో వరి పరిశోధనలకు కేంద్ర బిందువుగా నాణ్యమైన విత్తనాలను అందించడమే లక్ష్యంగా జగిత్యాల జిల్లాలో గల పొలాస వ్యవసాయ పరిశోధన స్థానం పని చేస్తుంది. ఇక్కడ రూపొందించిన విత్తనాలు తెలంగాణతో పాటు ఉత్తర భారత దేశంలో సాగులో ఉండడం గమనార్హం.

ఇక్కడి నుంచి వరిలో జగిత్యాల సన్నాలు, పొలాస ప్రభ, జగిత్యాల సాంబ, కరీంనగర్ సాంబ, జగిత్యాల మసూరి, ప్రాణహిత, మానేరు, బతుక మ్మ రకాలను విడుదల చేశారు. నువ్వుల్లో హిమ చందన, రాజేశ్వరీ, స్వేతాతిల్, పసుపులో సుగుణ, సుదర్శన వేరుశనగలో జేజీఎల్ 98 రకాలను శాస్త్రవేత్తలు రూపొందిం చారు. పంటల సరళి, కొత్తకొత్త రకాలతో ఈ పరిశోధన స్థానం విశేష స్థానం పొందింది. పరిశోధన ఫలాలను అన్నదాతల క్షేత్రాలకు చేరవేసే శాస్త్రవేత్తలు నిరంతరం కృషి చేస్తున్నారు. ఈ వంగడాలన్నీ ఉల్లి కోడును, అగ్గి తెగులును సమర్థవంతంగా ఎదుర్కోగలిగే సామర్థ్యం ఉన్నవే కావడంతో రైతుల్లో మంచి స్పందన లభిస్తుంది. అనేక రకాల వరి, ఇతర వంగడాలపై పరిశోధనలు, ప్రదర్శనలు ఏటా జరుగుతుండడం, రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందించడం, సాగులో మెళకులవలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తూ దినదినాభివృద్ధి చెందుతోంది.


జెజీఎల్ 28545 సన్న వరి గింజ రకం ప్రదర్శన

న్యాయం చేయాలని బాధిత కుటుంబీకుల ఆందోళన

మెట్‌పల్లి టౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): తన భర్తను చంపింది ఒక్కరు కాదు, ముగ్గురని వారిపై చర్యలు తీసుకోకుంటే ఆత్మహత్య చేసుకుంటానంటూ డీజిల్ డబ్బాతో మృతుడి భార్య, బంధువులతో కలిసి సోమవారం పట్టణంలో ఆందోళన చేపట్టింది. మల్లాపూర్ మండలం ఓబులపూర్ గ్రామానికి చెందిన పల్లపు సాయిలును తమ్ముడు ఆదివారం హతమార్చాడు.

అయితే మృతుడు సాయిలును చంపింది సాయిలు తమ్ముడితో పాటు మరో ఇద్దరు ఉన్నారని మృతుడి భార్య నవ్య ఆరోపిస్తూ తమ కుటుంబానికి న్యాయం చేసే వరకు మృతదేహాన్ని తీసుకెళ్లేది లేదని మొదట మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రి ముందు నిరసనకు దిగింది. అనంతరం బస్టాండ్ వద్ద జాతీయ రహదారిపై బైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నవ్య మాట్లాడుతూ తన భర్త సాయిలును మొత్తం ముగ్గురు కలిసి పక్కా


డీజిల్ డబ్బతో అందోళన చేస్తున్న మృతుడి భార్య నవ్య

ప్రణాళిక ప్రకారమే హత్య చేశారని ఆరోపించారు. మృతుడి మెడలో తులం బంగారం, 40 వేల విలువగల ఫోన్. పది వేల నగదు లాక్కొని తన భర్తపై ఇద్దరు తమ్ముళ్లు, మరో మేకల మంద యాజమానితో కలిసి హత్య చేశారని తెలిపింది. గతంలో భూ వివాదాలు ఉండేవని గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీలు జరిగాయని, కేసులు కూడా నమోదయ్యాయని ఆమె తెలిపింది. తన భర్త మృతి చెందడంతో ఇద్దరు కూతుళ్లకు ఆధారం లేదని కన్నీరు మున్నీరైంది. తన పిల్లలకు న్యాయం చేయాలని లేదంటే డీజిల్‌తో నిప్పంటించుకుంటానని ఆమె హెచ్చరించింది. సంఘటన స్థలానికి డీఎస్పీ ఉమామహేశ్వరరావు చేరుకుని బాధితురాలు నవ్యతో మాట్లాడి న్యాయం జరిగే లా చూస్తామని నిందితులను కఠినంగా శిక్షిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్ఐ కిరణ్ కుమార్‌లు ఉన్నారు.

ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి కరాటే పోటీలకు ఎంపిక

మంథని, అక్టోబరు 21: ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు మంథని జేకేఏ షోటోకాన్ కరాటే విద్యార్థులు ఎంపికైనట్లు ఇన్‌స్ట్రక్టర్ కోండ్ర నాగరాజు సోమవారం తెలిపారు. గోదావరిఖని ఆర్‌సీఓఏ క్లబ్‌లో పెద్దపల్లి జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ కొమురోజు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా 68వ ఎస్‌జీఎఫ్ కరాటే పోటీలు జరిగాయి. ప్రతిభను కనబర్చిన తమ విద్యార్థులు అండర్-14 విభాగంలో వడ్లకొండ శ్రీనిత, అండర్-17 విభాగంలో తోట హాసిని, రాగుల సహస్ర, బేరా ఆదిత్య తేజ, పొట్ల శ్రావణ్‌కుమార్, డుల్‌గచ్ దేవాన్ష్, రంగు శ్రీచరణ్‌లు రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ కరాటే పోటీలకు ఎంపి కైనట్లు తెలిపారు. వీరిని గోదావరిఖని ఏసీపీ మడత రమేష్, జేకేఏ సౌత్ జోన్ ఇంచార్జి రాపోలు సుదర్శన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూకల బానయ్య, జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ శ్రీనివాస్ అభినందించారు.

అరటి పండ్ల గోదాంపై దాడులు


మెట్‌పల్లిటౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎండి ఉస్మాన్ అలీ బ్రదర్స్ ఫ్రూట్స్ గోదాంలో సోమవారం ఫెడ్ఇన్‌స్పెక్టర్ అనూష సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా గోదాంలో నిల్వ ఉంచిన అరటి పండ్లను పరిశీలించారు. అరటి పండ్లు త్వరగా పక్కానికి రావడానికి విషపూరితమైన ఇథిలీన్‌ను అతిగా వాడుతున్నట్లు గుర్తించి గోదాంను సీజ్ చేసినట్లు తెలిపారు.

గోదావరిలో మునిగిన ఇసుక ట్రాక్టర్

మల్లాపూర్, అక్టోబరు, 21 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలంలోని వాల్గొండ సమీపంలోని గోదావరిలో సోమవారం ఓ ఇసుక ట్రాక్టర్ నీట మునింది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి అధికారులు సోమవారం ఉదయం నీటిని విడుదల చేశారు. అధికారులు ఈ విషయంపై గోదావరి తీర ప్రాంత ప్రజలకు సమాచారం అందించారు. కొందరు ఇసుక వ్యాపారులు కూలీలతో కలిసి ట్రాక్టర్ తీసుకొని గోదావరి నదిలోకి ఉదయం వెళ్లారు. ట్రాక్టర్‌లో ఇసుక నింపుతుండగానే ఒక్కసారిగా నీటి ప్రవాహం పెరిగిం ది. కూలీలు, డ్రైవర్ ట్రాక్టర్‌ను అక్కడే వదిలేసి ఒడ్డుకు చేరుకున్నారు. గోదావరిలో మునిగిన ట్రాక్టర్‌కు గజ ఈతగాళ్లు తాడు కట్టి ఎక్స్‌కవేటర్ సహాయంతో ఒడ్డుకు తీసుకొచ్చారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులు

సుల్తానాబాద్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సెయింట్ మేరీస్ స్కూల్‌కు చెందిన కాంపల్లి శ్రీలక్ష్మి ఉమ్మడి జిల్లా స్థాయి ఖోఖో పోటీల్లో తన ప్రతిభను చాటుకుని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. లక్ష్మిని ఫాదర్ షౌరెడ్డి అభినందించారు. సిరిసిల్లలో మూడు రోజుల పాటు నిర్వహించే శిక్షణలో కూడా పాల్గొని త్వరలో మహబూబాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటుందని ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఇండియన్ పబ్లిక్‌స్కూల్‌కు చెందిన ఎస్ శ్వేత, డి.ప్రియదర్శిని కూడా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని స్కూల్ చైర్మన్ మాటేటి సంజీవ్‌కుమార్, ప్రిన్సిపాల్ క్రిష్ణప్రియ తెలిపారు. ఆదివారం నిర్వహించిన ఖోఖో ఉమ్మడి జిల్లాస్థాయి పోటీల్లో వీరిద్దరు ప్రతిభ చాటుకుని రాష్ట్ర పోటీలకు అర్హత సాధించారని తెలిపారు.



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

దుబాయ్‌లో చేనేత కళాకారుడి వస్త్ర ప్రదర్శన


హరిప్రసాద్‌ను సన్మానిస్తున్న ప్రతినిధులు


హరిప్రసాద్ నేసిన వస్త్రాలు

సిరిసిల్ల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల చేనేత వస్త్ర పరిశ్రమలో అద్భుతాలు ఆవిష్కరిస్తున్న యెల్ది హరిప్రసాద్ మగ్గంపై నేసిన వివిధ వస్త్రాలను సోమవారం దుబాయ్‌లో దుబాయ్ ఎమిరేట్స్ పద్మశాలి అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రదర్శించారు. వస్త్రంపై మనుషుల బొమ్మలు, జీ 20 లోగో, అగ్గిపెట్టిలో అమిరె చీర వంటి వాటిని ప్రదర్శనలో ఉంచారు. సిరిపట్టు చీరలు, అంతరించిపోతున్న పీతాంబరం చీరతోపాటు నూలు పోగుల అల్లికలతో తయారు చేసిన చిత్రపటాల ప్రదర్శన అందరినీ అకట్టుకుంది. ఈ సందర్భంగా నేత కళాకారుడు హరిప్రసాద్‌ను అసోసియేషన్ ప్రతినిధులు గుత్తికొండ రవిచంద్ర, సరస్వతి సన్మానించారు.

రాష్ట్ర పోలీస్ డ్యూటీ మీట్‌లో

కరీంనగర్‌కు కాంస్య పతకం



ఐజీ అవినాష్ మొహంతి నుంచి కాంస్య పతకం అందుకుంటున్న సీఐడీ కానిస్టేబుల్ శ్రీనివాస్

కరీంనగర్ క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర పోలీస్ డ్యూటీ మీట్‌లో కరీంనగర్ పోలీస్ శాఖకు కాంస్య పతకం దక్కింది. తెలంగాణ ఏర్పడిన తర్వాత మొట్టమొదటిసారిగా రాష్ట్రంలో పోలీసు డ్యూటీ మీట్ ఏర్పాటు చేశారు. జిల్లాల వారీగా ఏర్పాటు చేసిన డ్యూటీ మీట్‌లో పతకాలు పొందిన పోలీసులకు రాష్ట్రస్థాయి హైదరాబాద్‌లో పోలీస్ డ్యూటీ మీట్ నిర్వహించారు. ఈ డ్యూటీ మీట్‌లో ఫొటోగ్రఫీ విభాగంలో కరీంనగర్ సీఐడీ కానిస్టేబుల్ కాసుల శ్రీనివాస్‌కు కాంస్య పతకం దక్కింది. దీనితో పాటు ఆల్ ఇండియా పోలీస్ డ్యూటీ మీట్‌కు శ్రీనివాస్ ఎంపికయ్యారు. వచ్చే నెలలో జార్ఖండ్ రాష్ట్రంలో నిర్వహించే ఆలిండి యా పోలీస్ డ్యూటీ మీట్‌లో శ్రీనివాస్ పాల్గొననున్నారు. శ్రీనివాస్‌కు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఐజీ అవినాష్ మొహంతి కాంస్య పతకం అందజేశారు.

సియోల్‌లో మంత్రుల బృందం

- వేస్టు టూ ఎనర్జీ ప్రాజెక్టు సందర్శన



సియోల్‌లో మంత్రుల బృందం

కరీంనగర్ అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): చెత్తను రీసైకిల్ చేసి విద్యుత్‌గా మార్చే వేస్ట్ టు ఎనర్జీ(డబ్ల్యుటీఇ) కేంద్రాలను సందర్శించేందుకు రాష్ట్ర మంత్రుల బృందం సోమవారం దక్షిణ కొరియాలోని సియోల్‌కు చేరుకుంది. అక్కడ వేస్ట్ టు ఎనర్జీ ప్రాజెక్టును మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ప్రకాష్ గౌడ్, కాలె యాదయ్య, మల్‌రెడ్డి రంగారెడ్డి, హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి పరిశీలించారు.

సౌత్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 21: ఆంధ్రప్రదేశ్‌లోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఈనెల 17 నుంచి 19 వరకు నిర్వహించిన 35వ సౌత్ ఇండియా జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. ఎం వినయ్ 3 వేల మీటర్ల పరుగు పందెం లో సిల్వర్ మెడల్, జి నక్షత్ర అండర్-14 బాలికల ట్రైథ్లాన్ విభాగంలో సిల్వర్ మెడల్, విష్ణువర్ధన్ 10 వేల మీటర్ల నడక పోటీల్లో బ్రాంజ్‌మెడల్ సాధించా రు. ఈ సందర్భంగా విద్యార్థులను, కోచ్‌లు వరుణ్ కృష్ణన్, తిరుపతిలను జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి శ్రీనివాస్, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, కడారి రవిలు అభినందించారు.




పతకాలు సాధించిన క్రీడాకారులు

- మల్లాపూర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యతో పాటు వివిధ అంశాల్లో శిక్షణ
- డిజిటల్, ఏఐ సాంకేతికతతో బోధన
- సాహస కృత్యాల్లో జాతీయస్థాయి గుర్తింపు
- చారిత్రక ప్రదేశాల పర్యటన

వైవిధ్యంగా బోధించడంతో పాటు.. విద్యార్థులు లక్ష్య సాధన దిశగా అడుగులు వేయడానికి ఆ పాఠశాల ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. తిమ్మాపూర్ మండలంలోని మల్లాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డిజిటల్ బోధనతో పాటు ఏఐ సాంకేతికతను జోడించి ప్రత్యేకంగా వివిధ అంశాలపై వీడియో పాఠాలు బోధిస్తున్నారు. తరగతి బోధనే కాకుండా విద్యార్థులను చారిత్రక ప్రదేశాలకు తీసుకువెళ్లి అక్కడి విశేషాలను తెలియజేస్తున్నారు. సాహస కృత్యాల్లో శిక్షణ ఇచ్చి వారిలో ఆత్మస్థయిర్యాన్ని నింపుతున్నారు.

వైవిధ్య బోధన.. లక్ష్య సాధన



ఏఐ సహాయంతో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయులు

తిమ్మాపూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : తరగతి గది బోధన మాత్రమే కాకుండా విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నారు.. మల్లాపూర్ జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులు. డిజిటల్ బోధన, ఏఐ సాంకేతికత జోడించి వివిధ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. తరగతి గదుల్లోనే కాకుండా క్షేత్రస్థాయిలో విద్యార్థులకు వివిధ అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. శారీరకంగా, మానసి కంగా ధృడంగా ఉండేలా విద్యార్థులకు సాసహకృత్యాల్లో తర్ఫీదు ఇస్తున్నారు. చారిత్రక ప్రదేశాల పర్యటనకు తీసుకువెళ్లి వారికి అవగాహన కల్పిస్తున్నారు. మల్లాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో ఆరవ తరగతి నుంచి పదో తరగతి వరకు మొత్తం 50 మంది విద్యార్థులు ఉండగా, ఎనిమిది మంది ఉపాధ్యాయులు ఉన్నారు.



రాష్ట్ర మాజీ గవర్నర్ తమిళిసై సౌందర్య రాజన్ చేతుల మీదుగా లీడర్ ట్రైనర్‌గా సర్టిఫికెట్ అందుకుంటున్న షరీఫ్ అహ్మద్



లాగ్ అండ్ టైర్ బ్రిడ్జిలో శిక్షణ పొందుతున్న విద్యార్థి

విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ

తరగతి పాఠాలే కాకుండా వివిధ అంశాలపై విద్యార్థులకు బోధిస్తున్నారు. వారానికి ఒకటి, రెండు రోజులు మార్చ్ ఫాస్ట్, కథంతాల్, ఫుట్‌డ్రిల్, స్మార్ట్‌నెస్, గుడ్ ఆర్డర్ నేర్పిస్తున్నారు. పాఠశాలకు చెందిన 9మంది విద్యార్థులు జాతీయ యూత్ అడ్వెంచర్ కార్యక్రమాల్లో పాల్గొని ప్రతిభ చాటారు. 30 అడుగుల ఎత్తైన కొలంబో బ్రిడ్జ్ క్రాసింగ్, జిప్ లైనింగ్, రాక్ క్లైంబింగ్, ఆర్చరీ వంటి సాహసోపేత కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

విద్యార్థులకు వాస్తవ ప్రపంచం చూపించడమే లక్ష్యం

షరీఫ్ అహ్మద్, హిందీ ఉపాధ్యాయుడు



విద్యార్థులకు పాఠ్యాంశాలను కేవలం పుస్తకాల్లోనే కాకుండా వాస్తవ ప్రపంచం చూపించడం మా లక్ష్యం. నేను విధులు నిర్వర్తించిన ప్రతి పాఠశాలలో విద్యార్థులు తమ ప్రతిభను చాటి ఎన్నో అవార్డులు అందుకున్నారు. ఇప్పటి వరకు మొత్తం 12 మంది విద్యార్థులు గవర్నర్ అవార్డులు, 32 మంది విద్యార్థులు ప్రధాన మంత్రి అవార్డులు, ఒక విద్యార్థి రాష్ట్రపతి అవార్డు తీసుకున్నారు. విద్యార్థులకు ప్రోత్సాహం అందించేందుకు తోటి ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు సహకరిస్తున్నారు.

అనుభవం మరింత ధైర్యాన్ని ఇచ్చింది

పి.రశ్మిత, 8వ తరగతి



పాఠశాలలో విద్యతో పాటు వివిధ రకాల శిక్షణ అనుభవం నాకు మరింత ధైర్యం అందించింది. టీమ్ గా కలిసి పనిచేసినప్పుడు నాకు ఎంతో సంతోషాన్ని ఇచ్చింది. మేము కలిసి కష్టాలను ఎదుర్కొన్నప్పుడు అద్భుతమైన అనుభూతి, అనుభవం ద్వారా మిత్రుల మధ్య బంధం ఎంత ముఖ్యమో గుర్తించాను. ప్రతి కృషి విజయాన్ని అందించింది.

- వీడియో పాఠాలు

ప్రభుత్వం కొన్ని పాఠశాలల్లో డిజిటల్ బోధనకు ఏర్పాట్లు చేస్తుండగా మల్లాపూర్ పాఠశాలలో కూడా డిజిటల్ బోధన అందిస్తున్నారు. రికార్డెడ్ పాఠాలు బోధించడంతో పాటు ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్)ను ఉపయోగించి వివిధ అంశాలపై వీడియోలు రూపొందించి విద్యార్థులకు అందిస్తున్నారు. సుల భంగా పాఠాలు అర్థమయ్యేలా వీడియోలు రూపొందిస్తున్నారు. చదువుతో పాటు సమాజంలో ఎలా ఉండలానే దానిపై విద్యార్థులకు మానవీయ విలువలను తెలుపుతూ వీడియోలను తరగతి గదిలో ప్రదర్శిస్తున్నారు. తల్లిదండ్రులు, అంధులు, అంగవైకల్యం, మహిళలు, పసిపిల్లలు, వృద్ధాప్యంలో ఉన్నవారికి ఎలాంటి గౌరవం ఇవ్వాలనే దానిపై అవగాహన కల్పిస్తున్నారు.



మానవీయ విలువ పై విద్యార్థుల ప్రదర్శన



షూటింగ్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థిని

సాహస కృత్యాలతో నాలోని భయం పోయింది. ఇప్పుడు నేను కొత్త కష్టాలను ఎదుర్కోవడానికి ధైర్యంగా ఉన్నాను. పాఠశాలలో మేము ఎంతో సంతోషంగా ఉన్నాం.



ఆర్చరీలో శిక్షణ పొందుతున్న విద్యార్థి

మా సర్ ప్రోత్సాహం ఎంతో ధైర్యాన్ని ఇచ్చింది

ఎం.భువన్ తేజ్, 7వ తరగతి




పాఠశాల అంటే భయం పోయింది. నాకు మా సర్ ఎంతో ప్రోత్సాహాన్ని అందించారు. నాకు ఈ అనుభవం చాలా ప్రత్యేకంగా ఉంది. నాకు స్నేహితులను సహాయం కోరడం ఎంత ముఖ్యమో చూపించింది. ఇలాంటి అనుభవం ద్వారా స్నేహితుల సహకారం, మద్దతు మన విజయానికి ఎంత కీలకమైనదో అర్థం చేసుకున్నాను.

సాహస కృత్యాలు నాలోని భయాలను పోగొట్టింది

ఆర్.మహేష్, 9వ తరగతి,



మా పాఠశాలలో చదువుతో పాటు వివిధ అంశాల పై శిక్షణ ఇస్తుండటంతో ప్రతిరోజు పాఠశాలకు వెళ్లాలనిపిస్తుంది.



మల్లాపూర్ పాఠశాల భవనము, పక్కన ఎత్తయిన గుట్ట

చారిత్రక అంశాలపై విద్యార్థులకు అవగాహన

విద్యార్థులకు ప్రేరణ ఇచ్చేందుకు వివిధ చారిత్రక ప్రదేశాలకు తీసుకువెళ్లి అక్కడ ఉన్న కట్టడాలను వారి చరిత్రను ప్రత్యేకతలను తెలుసుకునే విధంగా అవకాశం కల్పిస్తున్నారు. ఢిల్లీ, ఆగ్రాలోని ప్రధాన చారిత్రాత్మక ప్రదేశాలు ఎర్రకోట, లోటస్ టెం పుల్, కుతుబ్ మినార్, ఇండియా గేట్, రాష్ట్రపతి భవన్, అక్షర్‌ధామ్ టెంపుల్, తాజ్‌మహల్, ఆగ్రా కోటను సందర్శించా రు. హర్యానాలో పర్యటించిన విద్యార్థులు హర్యానాలోని మోడల్ పాఠశాలలను సందర్శించి, స్థానిక విద్యార్థులతో కలిసి కొత్త అనుభవాలు తెలుసుకున్నారు.



చారిత్రక ప్రదేశాల పర్యటనలో భాగంగా..

ఎస్‌యూను నంబర్‌వన్

యూనివర్సిటీగా తీర్చిదిద్దుతా

- న్యాక్ గుర్తింపు తీసుకురావడమే లక్ష్యం
- త్వరలోనే రెండు ఇంజనీరింగ్ కళాశాలల ఏర్పాటుకు కృషి
- నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ ఉమేష్ కుమార్

గణేశ్‌నగర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీని రాష్ట్రంలోనే నంబర్‌వన్ యూనివర్సిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ ఉమేశ్ కుమార్ తెలిపారు. వీసీగా నియామకమయ్యాక సోమవారం మొదటిసారిగా ఆయన శాతవాహన యూనివర్సిటీకి రాగా యూనివర్సిటీ రిజిస్ట్రార్ వరప్రసాద్ పుష్పగుచ్ఛం అందించి ఘనస్వాగతం పలికారు. వీసీ చాంబర్‌లో వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ కుటుంబ సభ్యులతో కలిసి బాధ్యతలు చేపట్టారు. అనంతరం మొదటి ఫైల్‌పై సంతకం చేశారు. బాధ్యత స్వీకరణ అనంతరం పలువురు యూనివర్సిటీ అధికారులు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శాతవాహన యూనివర్సిటీకి న్యాక్ గుర్తింపు తీసుకురావడమే తన లక్ష్యమని తెలిపారు. యూనివర్సిటీలో రెండు ఇంజనీరిం గ్ కళాశాలల ఏర్పాటుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు, జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో కృషి చేస్తానని పేర్కొన్నారు. యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు కావాల్సిన స్థలం మనకు అందుబాటులో ఉన్నదని తెలిపారు. యూనివర్సిటీలో కొత్త కోర్సులు, విద్యార్థులకు ఉపయోగపడే, జాబ్ ఓరియంటడ్, మల్టీ డిసిప్లేనర్ కోర్సుల ప్రవేశానికి ప్రత్యేకంగా దృష్టి పెడతామన్నారు. ఇందులో ఏ కోర్సు నుంచి ఏ కోర్సుకైనా వెళ్లాలా అవకాశం ఉంటుందన్నారు. తాను రిజిస్ట్రార్‌గా ఉన్న సమయంలో యూనివర్సిటీలో స్నాతకోత్సవం నిర్వహించామన్నారు. గవర్నర్, ఛాన్సలర్ జిష్ణు దేవ్‌వర్మను ఆహ్వానించి రెండో స్నాతకోత్సవ నిర్వహణకు చర్యలు తీసుకుంటానని వీసీ తెలిపారు. యూనివర్సిటీ సమస్యలను పలువురు ఇప్పటికే తన దృష్టికి తీసుకువచ్చారని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. యూనివర్సిటీలో బీఈడీ, ఎం ఈడీ కళాశాలల ఏర్పాటు విషయం కూడా పరిశీలస్తామన్నారు. కార్యక్ర మంలో రిజిస్ట్రార్ ఎం.వరప్రసాద్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ వై.కిషోర్, ప్రసాద్, పరీక్షల నియంత్రణాధికారి ఎస్వీ శ్రీరంగ ప్రసాద్, యూనివర్సిటీ ఆర్ట్స కాలేజీ ప్రిన్సిపాల్ ఎండీ జాఫర్ జారీ, యూనివర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ హరికాంత్, యూనివర్సిటీ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ జయంతి పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ఉమేష్‌కుమార్



వీసీ ఉమేష్‌కుమార్‌కు స్వాగతం పలుకుతున్న రిజిస్ట్రార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్, అధ్యాపకులు



గంట స్తంభం.. గత వైభవ చిహ్నం

జగిత్యాల ప్రాశస్త్యాన్ని చాటుతున్న వైనం

జిల్లా వాసులను ఆకట్టుకుంటున్న నిర్మాణం

జగిత్యాల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల గత వైభవానికి చిహ్నంగా క్లాక్ టవర్ నిలుస్తోంది. ఎన్నో ఆటుపోట్లు తట్టుకొని ప్రజలకు నేనున్నాంటూ పట్టణ నడిబొడ్డున ధీమాగా నాలుగు ముఖాల క్లాక్ టవర్ నిలిచింది. క్లాక్ టవర్ పట్టణ అందాన్ని మరింత ఇనుమడింపజేస్తోంది. దీనిని చల్‌గల్‌కు చెందిన 1936 సంవత్సరంలో ధర్మా జలపతి రావు దేశ్‌ముఖ్ నిర్మించారని స్థానికులు అంటున్నారు.

ఇందులోని గడియారం జర్మని నుంచి ప్రత్యేకంగా తయారు చేయించి తీసుక వచ్చారని చెబుతున్నారు. ప్రజలు ప్రాణాంతకమైన కలరా వ్యాధి నుంచి కోలుకున్న సందర్భంగా దాని నిర్మూలనకు సాక్ష్యంగా దేశ్‌ముఖ్ ధర్మా జలపతి రావు నిర్మించారని కథనం ప్రచారంలో ఉంది. గంట గంటకు మోగే ఈ గడియారం చదువురాని సామాన్యులకు సైతం సమయం తెలిసిపోయేలా ఏర్పాటు చేశారు. అయితే చారిత్రకమైన టవర్‌లో గల క్లాక్ ప్రస్తుతం మరమ్మతుకు గురై పనిచేయడం లేదు. తొలినాళ్లలో కాషాయం, తెలుపు రంగు పైభాగంతో సుమారు 60 అడుగుల ఎత్తయిన అష్టభుజి గోపురం దీని ప్రత్యేకత అని అంటున్నారు. స్తంభానికి ఎత్తయిన భాగంలో నాలుగు వైపుల కనిపించేలా గడియారం ఏర్పాటు చేశారు. ఈ తదుపరి కాలంలో దీనికి పలు పర్యాయాలు రంగులు మారాయి. పైన నీలి రంగు, చుట్టూ తెలుపు, యాష్ రంగులతో ప్రస్తుతం టవర్ ఉంది. పలు పండుగలు, దినోత్సవాల సందర్భంగా రంగు రంగుల విద్యుత్ దీపాలతో ఈ చారిత్రక చిహ్నం చూపరులను విశేషంగా ఆకట్టుకుంటోంది. జగిత్యాల పేరు చెబితే గుర్తుకు వచ్చే వాటిలో టవర్ కూడా ఒకటిగా గుర్తింపు పొందింది. పట్టణ నడిబొడ్డున గల టవర్ నాలుగు వైపుల ప్రధాన రహదారులు వాటికి ఇరువైపుల వ్యాపార, వాణిజ్య సముదాయాలున్నాయి. ప్రస్తుతం పనిచేయని గడియారం, సైరన్‌లను మరమ్మతు చేయాల్సిన అవసరముంది. పాలకులు పట్టించుకొని క్లాక్ టవర్ అభివృద్ధికి కృషి చేయా లని, టవర్ చరిత్రను, విశిష్టతను పర్యాటకులు తెలుసుకునే విధంగా ఏర్పాట్లు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



ఐటీఐల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఐటీఐల్లో ప్రవేశానికి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కరీంనగర్ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ కె.అశోక్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఐదు విడుతల్లో భర్తీ చేయగా మిగిలిన సీట్లను వాక్ ఇన్ అడ్మిషన్స్ ద్వారా భర్తీ చేయనున్నట్లు తెలిపారు. పదవ తరగతి పాసైన అర్హులైన అభ్యర్థులు వెబ్‌సైట్ లో వెరిఫికేషన్ ఫీజు ఒక రూపాయి చెల్లించి ఈ నెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. గతంలో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న వారు మళ్లీ దరఖాస్తు చేసుకోకుండా నేరుగా హాజరు కావాలని తెలిపారు. ఇప్పటికీ సీట్లు కేటాయించిన వారికి వాక్ ఇన్ అడ్మిష న్స్‌లో అవకాశం లేదన్నారు. మరిన్ని వివరాలకు 7799100360, 9989182747 నంబర్లలో సంప్రదించాలన్నారు.

న్యూస్ బాక్స్

ఎల్ఐసీ కార్యాలయం ఎదుట ఏజెంట్ల ధర్నా

పెద్దపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీలో ఇటీవల కొత్తగా తీసుకువచ్చిన విధానాలను రద్దు చేయాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. సోమవారం ఎల్ఐఏఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్దపల్లి పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు సాగి ప్రసాద్‌రావు మాట్లాడుతూ ఎల్ఐసీలో ఇటీవల తీసుకువచ్చిన నూతన విధానాల వల్ల ఎల్ఐసీ ఏజెంట్ల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. పాలసీదారులకు ప్రీమియం పెంపుతో పాటు ఏజెంట్లకు కూడా కమిషన్ తగ్గించారన్నారు. పాలసీలపై జీఎస్టీని తగ్గించాలని, ఏజెంట్లకు బోనస్ కమిషన్ పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏజెంట్లు పాల్గొన్నారు.

చెరువు కబ్జాపై అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు

జూలపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడుకాపూర్ గ్రామ శివారులో గల కోమిటికుంట శిఖం భూమి విస్తీర్ణం 18 ఎకరాలను అదే గ్రామానికి చెందిన కన్నం అంజయ్య అనే నాయకుడు కబ్జా చేశాడని ఆరోపిస్తూ సోమవారం ముదిరాజ్ సంఘం నాయకులు అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాద్‌లాల్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం ముదిరాజ్ సంఘం నాయకులు మాట్లాడుతూ కన్నం అంజయ్య అనే బీజేపీ నాయకుడు కోమటికుంటను కబ్జాచేయడమే కాకుండా కుంట కట్టను పూర్తిగా తీసివేసి చదును చేశాడన్నారు. ప్రభుత్వం చెరువులు, కుంటలను కాపాడి తమకు జీవనోపాధిని కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ముదిరాజ్‌సఘం అధ్యక్షుడు కనకట్ల స్వామి, ఉపాధ్యక్షుడు జెట్టి సతీష్, కోశాధికారి తీగల రమేష్, డైరెక్టర్లు తదితరులు ఉన్నారు.

ఏఈగా అశోక్‌కుమార్

కమాన్‌పూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కమాన్‌పూర్ మండల ఏఈగా నాల అశోక్‌కుమార్ కార్యాలయంలో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయనతో పాటు సబ్‌ఇంజనీర్‌గా శ్రావణ్ కుమార్, లైన్ ఇన్‌స్పెక్టర్‌గా సత్యనారాయణరావు సైతం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు లైన్‌మెన్‌లు వారికి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో పలువురు లైన్‌మెన్‌లు పాల్గొన్నారు.

రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

- ధాన్యం కొనుగోళ్లు సకాలంలో పూర్తి చేయాలి

- ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



అబ్బాపూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ అడ్లూరి

ధర్మారం (పెద్దపల్లి రూరల్), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ధర్మారం మండలం పత్తిపాక, నర్సింగాపూర్, మల్లాపూర్, కటికనపల్లి, కమ్మరిఖాన్ పేట్, కొత్తూరు, కటికనపల్లి, ధర్మారం మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భం గా ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, రైతులకు ఇబ్బందు లు లేకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్న దృష్ట్యా రైతులకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని, ఏ ఒక్క రైతుకు ఇబ్బంది జరగకుండా బాధ్యత తీసుకోవాలన్నారు. అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ వర్తిస్తుందని, సాంకేతిక కారణాలతో రుణమాఫీ వర్తించని రైతులకు తాను బాధ్యత తీసుకొని రుణమాఫీ జరిగే విధంగా చర్యలు తీసుకుంటానన్నారు.

● ఇందిరా మహిళ శక్తి క్యాంటీన్ ప్రారంభం..

ధర్మారంలోని పంచాయతీరాజ్ నూతన అతిథి గృహంలో మండల మహిళ సమైక్య ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఇందిర మహిళ శక్తి క్యాంటీన్‌ను అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రారంభించారు. ధర్మపురి నియోజకవర్గంలో తొలిసారిగా ఏర్పాటు అవుతున్న క్యాంటీన్ ద్వారా అతి తక్కువ ధరలకు ఆహార పదార్థాలను పొందడంతో పాటు, మహిళలకు ఉపాధి లభిస్తుందని ఇది సంతోషకరమైన విషయమని అన్నారు. కార్యక్రమంలో ధర్మారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లావుడియా రూప్లా నాయక్, వైస్ చైర్మన్ అరిగెల లింగయ్య, నంది మేడారం పత్తిపాక సింగిల్ విండో చైర్మన్లు ముత్యాల బలరాం రెడ్డి, నోముల వెంకట్ రెడ్డి ఎంపీడీవో ఐ. ప్రవీణ్ కుమార్, తహసీల్దార్ మహమ్మద్ ఆరిఫొద్దీన్, మండల పంచాయతీ అధికారి రమేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, మండల యువజన విభాగం అధ్యక్షుడు సోగాల తిరుపతి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, సింగిల్ విండో డైరెక్టర్లు నాయకులు పాల్గొన్నారు.

జూలపల్లి (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సూచించారు. మండలంలోని అబ్బాపూర్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని లక్ష్మణ్‌కుమార్ సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బొద్దుల లక్ష్మీనర్సయ్య, దండె వెంకటేశం, ఏవో ప్రత్యూష, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా పోలీస్ అమరవీరుల దినోత్సవం

యైటింక్లయిన్‌కాలనీ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్స వాన్ని పురస్కరించుకుని విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసులకు టూటౌన్ పోలీసులు స్మరించుకున్నారు. టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తూ 1999లో కాటారం సమీపంలో జరిగిన నక్సల్‌దాడిలో ప్రాణాలు కోల్పోయిన కురుసుం బాపుకు గురువారం పోలీసు సిబ్బంది నివాళులు అర్పించారు. పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్న బాపు సమాధి వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్సైలు, కానిస్టేబుళ్లు హోంగార్డులు పాల్గొన్నారు. షిర్కే చౌరస్తా నుంచి తెలంగాణ చౌరస్తా వరకుపోలీస్ సిబ్బందితో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు క్యాండీల్ ర్యాలీ నిర్వహించారు.

● ఈవీఎస్ ఎన్‌జీఓ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. 35 మంది యుకులు శిబిరంలో రక్తదానం చేశారు. అనంతరం నేటి సమాజంలో పోలీస్ పాత్ర అనే అంశంపై విద్యార్థులకు వ్యాస రచన పోటీలను నిర్వహిం చారు. కార్యక్రమాల్లో ఎన్‌జీఓ చైర్మన్ ఇరికి మహేష్, గుండేటి రాజేష్, మారెల్లి రాజిరెడ్డి, మండల కిషన్‌రెడ్డి, వై తిరుపతి, చక్రపాణి, ఆకు ల శశి, తిరుపతిరెడ్డి, రాములు పాల్గొన్నారు.

మంథని: శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా విధి నిర్వాహణలో అసువులు బాసిన పోలీసు అమర వీరుల త్యాగాలను అందరు స్మరించుకోవాలని మంథని సీఐ రాజు కోరారు. సోమవారం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక పోలీసు స్టేషన్ అవరణలో ఉన్న పోలీస్ అమరవీరుల స్థూపం వద్ద సీఐ రాజు, ఎస్‌ఐలు రమేష్, సిబ్బంది పోలీసు అమర వీరులకు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు, హోంగార్డులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

ధర్మారం (పెద్దపల్లి రూరల్), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ధర్మారం మండలంలోని వివిధ గ్రామాల్లో 62 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ సోమవారం అందజేశారు. నంది మేడారం గ్రామానికి చెందిన బొడ్డు అక్షితకు, వేల్పుల కొమరవ్వ కూతురు వేల్పుల మౌనిక మరియు స్వర్ణలకు వేర్వేరుగా కల్యాణ లక్ష్మి చెక్కులను అందించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ లావుడియా రూప్ల నాయక్, వైస్ చైర్మన్ ఆరిగెల లింగయ్య , కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

పనిస్థలాల్లో రక్షణ సూత్రాలు పాటించాలి

పాలకుర్తి,అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పనిస్థలాల్లో ప్రతి ఒక్కరూ విధిగా రక్షణ సూత్రాలు పాటిస్తూ సిమెంటు ఉత్పత్తికి పాటుపడాలని కేశోరాం సిమెంటు కంపెని కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కౌశిక హరి అన్నారు. సోమవారం మైన్స్ విభాగంలో నిర్వహించిన రక్షణ వారోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సంద్భంగా హరి మాట్లాడుతూ మైన్స్‌లో రక్షణ పెంపు కోసం చేపట్టాల్సిన చర్యల గురించి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. అంతకు ముందు మైన్స్‌లో సంస్థ తీసుకున్న రక్షణ చర్యలపై రక్షణ విభాగం అధికారులు వివరించారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధానకార్యదర్శి మాదాసు శ్రీనివాస్, యూనియన్ సభ్యులు, పర్మినెంటు, కాంట్రాక్టు కార్మికులు, కంపెని అధికారులు పాల్గొన్నారు.

నూతన విద్యావిధానాన్ని అమలు చేయవద్దు

పెద్దపల్లి కల్చరల్ , అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా సమితి ఆధ్వర్యంలో నూతన జాతీయ విద్యా విధానం 2020ను అమలు చేయవద్దని అదనపు కలెక్టర్ అరుణశ్రీకి సోమవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం మాట్లాడుతూ రాష్ట్రంలో నూతన జాతీయ విద్యావిధానం 2020 అమలు చేయడం ద్వారా యూని వర్సిటీల స్వయం ప్రతిపత్తిని దెబ్బ తీసే ప్రయత్నం చేస్తు న్నారని ఆయన విమర్శించారు. కేంద్రియ విశ్వవిద్యాలయాల్లో ఆరెస్సెస్ ఎజెండా అమలుకు బీజేపీ ప్రయత్నం చేస్తోందన్నారు. తెలంగాణ సాయుధ పోరాట వాస్తవాలను వక్రీకరించడంలో బీజేపీ ముందుందన్నారు. తక్షణమే జాతీయ నూతన విద్యా విధానాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్నకొండ సాయిఆజాద్, గాజుల వినయ్, తదితరులు పాల్గొన్నారు.

వనరులు తరలుతున్నా.. నిధులు సున్నా

(ఐదో పేజీ తరువాయి)

నియోజకవర్గాల్లో 8,266 పనులకు గాను 782 కోట్ల 94 లక్షల రూపాయలు మంజూరు చేశారు. ఈ పనులు దాదాపు పూర్తి కావచ్చాయి.

● ఐదేళ్లుగా జమ కానీ నిధులు..

జిల్లాలో అతి పెద్ద వనరుగా భావిస్తున్న సింగరేణి సంస్థ నుంచి ఐదేళ్లుగా డీఎంఎఫ్‌టీకి నేరుగా డబ్బులు జమ కావడం లేదని అధికారులు చెబుతున్నారు. సింగరేణితో పాటు ఆయా సంస్థలు జమ చేస్తున్న నిధులను జిల్లాకు కేటాయించకుండా రాష్ట్ర ప్రభుత్వమే వివిధ అవసరాలకు వాడుకుంటున్నట్లు తెలుస్తున్నది. అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధిలో భాగంగా 50 కోట్ల రూపాయలతో ప్రణాళికలు రూపొందించారు. కానీ 35 కోట్ల బడ్జెట్ మాత్రమే రావడంతో ఆ మేరకు మాత్రమే పనులు చేస్తున్నారు. ఇంకా 15 కోట్ల విలువైన పనులను మంజూరు చేయాల్సి ఉంది. గతంలో డీఎంఎఫ్‌టీ కింద చేసిన పనులకు సంబంధించి చాలా వరకు బిల్లులు పెండింగులో ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల పరిసరాల పరిశుభ్రత కోసం స్కావెంజర్లు, సర్వీస్ వర్కర్లను నియమించుకోవాలని, ఇందుకోసం డీఎంఎఫ్‌టీ నిధులను వాడుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ మేరకు జిల్లాలో నెలకు 25 లక్షల తొమ్మిది వేల చొప్పున పది నెలలకు గాను 2 కోట్ల 50 లక్షల 90 వేల రూపాయలు అవసరం ఉంటాయని, డీఈవో ప్రతిపాదనలను జిల్లా కలెక్టర్‌కు పంపించారు. కానీ డీఎంఎఫ్‌టీలో నిధులు లేవని ఫైల్‌ను తిరిగి పంపించారు. అలాగే ఒక్క కొత్త పని కూడా మంజూరు చేసే పరిస్థితి లేదు. జిల్లాలో గల ఖనిజ, ఇసుక, ఇతర వనరుల ద్వారా ప్రతి ఏటా 130 నుంచి 150 కోట్ల రూపాయలకు పైగా జమ అవుతాయని, జిల్లా అభివృద్ధి కోసం ఎవరి వద్ద చేయిచాచకుండా అభివృద్ధి చేసుకుందామని ఆశిస్తే, వారి ఆశలు అడియాసలే అవుతున్నాయి. గత ప్రభుత్వమే గాకుండా, ప్రస్తుత ప్రభుత్వం కూడా డీఎంఎఫ్‌టీ నిధులను పంపించడం లేదు. జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పెద్దపల్లి, రామగుండం ఎమ్మెల్యేలు చింతకుంట విజయరమణారావు, రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచితే తప్పనిసరిగా నిధులు విడుదల అవుతాయనే అభిప్రాయాన్ని జిల్లా ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.

ధాన్యం కొనుగోళ్లకు కట్టుదిట్టమైన చర్యలు

- కలెక్టర్ కోయ శ్రీ హర్ష

సుల్తానాబాద్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు ప్రక్రియను సజావుగా జరిగే విధంగా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. కలెక్టర్ సుల్తానాబాద్ మండలంలోని చిన్నకలువల గ్రామంలో ఏర్పాటు చేయనున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా సహకార అధికారి శ్రీమాల తదితరులతో కలసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేయనున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సన్న వడ్లు, దొడ్డు వడ్లకు వేరువేరుగా కౌంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన గన్ని బ్యాగులు, ప్యాడీ క్లీనర్లు, తేమ యంత్రాలు, వెయింగ్ మిషన్లు ఏర్పాటు చేయాలన్నారు. రైతులు హమాలీల సౌలభ్యం కోసం కేంద్రాల వద్ద తాగునీటి వసతి కల్పించాలన్నారు. అకాల వర్షాల నేపథ్యంలో అందుబాటులో టర్పాలిన్ కవర్లు సిద్ధంగా ఉంచుకోవాలని అన్నారు. సన్నరకం ధాన్యం నాణ్యతను వ్యవసాయ విస్తీరణ అధికారులు ధ్రువీకరిస్తారని తెలిపారు. ఏఈవో టోకెన్ నంబర్, ధాన్యం రకం పరిమాణం, నాణ్యత మొదలగు అంశాల సర్టిఫికెట్ పరిశీలించి కాంటా పెట్టాలని ఆదేశించారు. ఇందుకు సంబంధించి అన్ని వివరాలతో ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలన్నారు. హమాలలీను ఎక్కువ మందిని అందుబాటులో ఉంచుకో వాలని, ధాన్యం కొనుగోలు వివరాలను వెంట వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయా లన్నారు. రైతులకు 48 గంటల్లో చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికా రులను, కేంద్రాల నిర్వాహకులను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట సీఈవో వల్లంకొండ రమేష్, రైతులు ఉన్నారు.

వైస్ చాన్సలర్‌కు సన్మానం

కాల్వశ్రీరాంపూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కునారం గ్రామానికి చెందిన దండ రాజిరెడ్డిని కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యానవన యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్‌గా ప్రభుత్వం నియమించింది. దీంతో మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్ రాజిరెడ్డిని హైదరాబాద్‌లోని ఉద్యానవన శాఖ కార్యాలయంలో సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో ఉద్యానవనశాఖ ఏడీ ఈ కృష్ణారె డ్డి, న్యాయవాది మార కిషోర్, ముత్యం శంకర్‌గౌడ్, దండ కొండల్‌రెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

రైస్ మిల్లు అనుమతి రద్దు చేయాలి

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రామగిరి మండలం కల్వచర్ల గ్రామ పంచాయతీ పరిధిలో గృహాల సమూదాయంలో రైస్ మిల్లు నిర్మిస్తున్నారని వెంటనే అనుమతి రద్దు చేసి పనులు నిలిపి వేయాలని గ్రామస్థులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. వినతి పత్రం అందించిన వారిలో ప్రభాకర్, సదాశివ, సత్యనారాయణ, మల్లయ్య తదితరులు ఉన్నారు.

ఆలయంలో ఉద్యమకారుల పూజలు

కమాన్‌పూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆదివరాహస్వామి ఆలయంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం సభ్యులు సోమవారంప్రత్యేక పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేరేలా చూడాలంటూ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్, జిల్లా అధ్యక్షుడు గుండేటి ఐలయ్యయాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూనె రాజేశం, రాష్ట్ర కార్యదర్శి కదార కళాధర్‌రెడ్డి, ఉద్యమకారులు ఉన్నారు.

రైతులు, ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న బీఆర్ఎస్

- ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నాయకులు మతిభ్రమించి మాట్లాడుతూ ప్రజలను, రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. స్థానిక ఓ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీ చేయలేదని బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారాన్ని చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. బీఆర్ఎస్ నాయకులు ధర్నాలు చేసే ముందు ఒక్కసారి ఆలోచించాలన్నారు. పదేళ్లకాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రెండుసార్లు రైతు రుణమాఫీ చేస్తామని, మోసం చేసిన విషయాన్ని గుర్తుచేసుకోవాలని సూచించారు. 2014, 2018 ఎన్నికల సమయంలో లక్ష రూపాయల రుణమాఫీ చేస్తామని, విడతల వారీగా చేయడంతో, రుణమాఫీ వడ్డీకి కూడా సరిపోలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన పది నెలల కాలంలోనే 70 శాతం పైగా రైతులకు రుణమాఫీ చేశామని తెలిపారు. మిగితా రైతుల చిక్కులు పరిష్కరించి అందరికి రుణమాఫీ చేస్తామని ఆయన పేర్కొన్నారు. సన్నవడ్లకు ఈ సీజన్ నుంచే ఐదు వందల రూపాయల బోనస్ చెల్లిస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్, పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఈర్ల స్వరూప, నాయకులు జడల సురేందర్, నూగిళ్ళ మల్లయ్య, సందనవేన రాజేందర్, ఉప్పు రాజు పాల్గొన్నారు.

నాణ్యతలేని చేపపిల్లలు పంపిణీ చేసిన వారిపై ఫిర్యాదు

మంథని, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):: మంథని మండలానికి నాణ్యత లేని చేప పిల్లలను పంపిణీ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని హైదరాబాద్‌లోని రాష్ట్ర మత్స్య పారిశ్రామిక సహకార సంఘం కార్యాలయంలో ఫిషరీష్ చైర్మన్‌మెట్టు సాయికుమార్‌ను కలిసి ఫిర్యాదు చేసినట్లు జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం డైరెక్టర్ పోతరవేన క్రాంతి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. చిన్న సైజ్‌లో నాణ్యత లేని చేపలపిల్లలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. గత సంవత్సరం నుంచి పెండింగ్‌లో ఉన్న మంథని కే8 సొసైటీ సంబంధించిన నూతన సభ్యత్వాలను త్వరగా అందించాలని కోరారు.

రైతులను ఇబ్బంది పెట్టింది బీఆర్ఎస్ పార్టీనే

అంతర్గాం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): లక్ష రూపాయల రుణ మాఫీ కోసం ఐదు సంవత్సరాల పాటు కాలయాపన చేసింది బీఆర్ఎస్ పార్టీయేనని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పెండ్రు హనుమాన్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం అంతర్గాం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించి ఈ మేరకు మాట్లాడారు. రైతు సమస్యలపై నిరసన తెలిపిన మాజీ ఎమ్మెల్యే చందర్ ఉనికి చాటుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాటు అధికారంలో ఉన్న సమయంలో ఈ ప్రాంత రైతులకు ఎందుకు సాగునీరు అందించలేదని ప్రశ్నించారు. ఈ ప్రాంత ప్రజలకు ఎమ్మెల్యే మక్కాన్ సింగ్‌రాజ్ ఠాగూర్‌పై నమ్మకం ఉన్నది కాబట్టే గెలిపించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉరిమెట్ల రాజలింగం, పూదరి సత్తయ్య గౌడ్, సింగం కిరణ్‌కుమార్‌గౌడ్, మడ్డి తిరుపతిగౌడ్, జూల లింగయ్య మాజీ సర్పంచ్‌లు ఆముల శ్రీనివాస్, గుంట లక్ష్మణ్, తమ్మనవేని కొమురయ్య, కొరండ్ల రవీందర్‌రెడ్డి, బొడకుంట సంతోష్ పాల్గొన్నారు.

బీజేవైఎం ఆధ్వర్యంలో రాస్తారోకో

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంటు, స్కాలర్‌సిప్ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ స్థానిక బస్టాండ్ వద్ద సోమవారం బీజేవైఎం ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. జిల్లా ప్రధాన కార్యదర్శి శివంగారి సతీష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ విడుదల చేయాలని సూచించారు, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడుస్తున్నా పెండింగ్ బకాయిలను చెల్లించకుండా నిర్లక్ష్యం వహించడం పేద విద్యార్థుల జీవితాలకు శాపంగా మారిందన్నారు. కార్యక్రమంలో బెజ్జంకి దిలీప్ పల్లె సదానందం పర్స సమ్మయ్య, సందీప్,అక్క పెళ్లి క్రాంతికుమార్, సంతోష్, విజయ్, ఫహీమ్, వరప్రసాద్ మరియు యువ మోర్చా కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు



ఓసీపీ-5ని సందర్శించిన జీఎం(క్వాలిటీ)



అధికారులతో మాట్లాడుతున్న జీఎం(క్వాలిటీ) రవికుమార్

గోదావరిఖని, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆర్‌జీ-1 జీడీకే ఓసీపీ-5ని జీఎం(క్వాలిటీ) కార్పొరేటర్ అయినాల రవికుమార్ సోమవారం సందర్శించారు. ఓసీపీలో పని స్థలాల్లో క్వారీ, ఫీడర్స్, ఎస్ఎస్‌పీలలో సందర్శించి బొగ్గు నాణ్యత ప్రమాణాలను పెంచే దిశగా తగు సూచనలు చేశారు. రక్షణతో కూడిన నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి చేయాలన్నారు. కార్యక్రమంలో రామగుండం రీజియన్ జీఎం(క్వాలిటీ) బైద్య, ఆర్‌జీ-1 జీఎం డీ లలిత్ కుమార్, డీజీఎం (క్వాలిటీ) సాయి ప్రసాద్, ప్రాజెక్ట్ ఆఫీసర్ కే చంద్రశేఖర్, ఎస్‌ఓఎం డీ రమేష్ బాబు, అఫీషియటింగ్ మేనేజర్ పొనుగోటి శ్రీనివాస్, సర్వేయర్ చంద్రమౌళి, అడిషనల్ మేనేజర్(క్వాలిటీ) రవి, ఆఫ్ లోడింగ్ ఇన్‌చార్జి గంధం రాములు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ కమిటీ ఏర్పాటు

రామగిరి, అక్టోబరు 21: సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ ఐఎన్‌టీయుసీ నూతన బ్రాంచ్ కమిటీ ఏర్పాటైయ్యింది. ఈ సందర్భంగా జీఎం కార్యాలయంలో ఏర్పాటైన పరిచయ కార్యక్రమా సమావేశానికి రాష్ట్ర కనీస వేతన సలహామండలి చైర్మన్ జనక్‌ప్రసాద్ ముఖ్యఅతిథిగా హజరైయ్యారు. నూతన ఏర్పాటైన కమిటీని అధికారులకు పరిచయం కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు, ఏఎల్‌పీ ప్రాజెక్టు అధికారి నాగేశ్వర్‌రావు, ఐఎన్‌టీయూసీ సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నరసింహరెడ్డి, ధర్మపురి, ఆర్జీ-3 ఉపాధ్యక్షుడు కొట రవీందర్‌రెడ్డి, బ్రాంచ్‌కమిటీ, పిట్‌కమిటీ నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందనున్న అధికారికి సన్మానం

రామగిరి అక్టోబరు 21: (ఆంధ్రజ్యోతి) సింగరేణి సంస్థ ఆర్జీ-3 జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమంలో భాగంగా ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ పొందనున్న కార్పోరేట్ సర్వే విభాగం జనరల్ మేనేజర్ ఎండీ జైనుల్లాబద్దీన్‌ను సోమవారం రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌వో-2 జీఎంలు జి రఘుపతి, బి సత్యనారాయణ, ఫైనాన్స్ ఏజీఎం ప్రాజెక్ట్ అధికారి ఎన్ రమేష్ అధికారులు పాల్గొన్నారు.

2349 మంది బదిలీ వర్కర్లు జనరల్ మజ్దూర్లుగా క్రమబద్ధీకరణ

సీఎండీ ఆదేశాల మేరకు ఉత్తర్వులు జారీ

గోదావరిఖని, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పనిచేస్తున్న 2,349 మంది బదిలీ వర్కర్లను జనరల్ మజ్దూర్లుగా క్రమబద్ధీకరిస్తూ యాజమాన్యం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. సంస్థ సీఎండీ ఎన్ బలరామ్ ఆదేశాల మేరకు అన్ని ఏరియాలకు ఉత్తర్వుల పత్రాలను విడుదల చేశారు.

సంస్థలో చేరినప్పటి నుంచి క్యాలెండర్ ఏడాదిలో భూగర్భ గనుల్లో 190 రోజులు, ఉపరితల గనులు, విభాగాల్లో 240రోజులు విధులు నిర్వహించిన వారిని రెగ్యులరైజ్ చేశారు. సెప్టెంబరు 1, 2024 నుంచి వీరిని జనరల్ మజ్దూర్లుగా గుర్తించినట్లు ఉత్తర్వులలో పేర్కొన్నారు. ఎలాంటి నిరీక్షణ లేకుండా ఏడాదిలో నిర్ణీత మస్టర్లు పూర్తి చేసిన వారిని జనరల్ మజ్దూర్లుగా ఉద్యోగ ఉన్నతి కల్పించడంపై కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. కారుణ్య నియామక ప్రక్రియ కింద సింగరేణిలో ఉద్యోగాలు పొందిన వారసులను ముందుగా బదిలీ వర్కర్లుగా గుర్తిస్తూ సింగరేణి వ్యాప్తంగా ఉన్న భూగర్భంలో పనిచేయడానికి యాజమాన్యం పోస్టింగులు ఇస్తుంటుంది. ఈ విధంగా గనులకు కేటాయించబడిన బదిలీ వర్కర్లు ఏడాదిలో కనీసం 190 మస్టర్లు పూర్తి చేస్తే వారిని జనరల్ మజ్దూర్లుగా యాజమాన్యం గుర్తిస్తుంది. ఉపరితల గనులు, విభాగాల్లో అయితే 240 మస్టర్లు పూర్తి చేయాల్సి ఉంటుంది. గతంలో ఈ ప్రక్రియకు ఏళ్ల తరబడి సమయం తీసుకుంటూ ఉండేవారు. సంస్థ సీఎండీ ఎన్ బలరామ్ ప్రత్యేక చొరవ తీసుకొని ఉద్యోగం చేరిన వారు ఏడాదిలో 190 మస్టర్లు పూర్తి చేయగానే ప్రమోషన్ ఇవ్వాలని పర్సనల్ విభాగం అధికారులను ఆదేశించారు. సింగరేణిలో ఒకేసారి 2,349 మందిని జనరల్ మజ్దూర్లుగా ఉద్యోగ ఉన్నతి కల్పించిన సందర్భంగా ప్రతిఒక్కరూ అంకిత భావం, క్రమశి క్షణతో పనిచేయాలని సీఎండీ ఎన్ బలరామ్ సూచించారు. గైర్హాజర్ అయితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఎండీ స్పష్టం చేశారు.

● శ్రీరాంపూర్ ఏరియాలో అత్యధికంగా 662మంది..

జనరల్ మజ్దూర్లుగా అత్యధికంగా శ్రీరాంపూర్ నుంచి 662మంది ఉద్యోగోన్నత పత్రాలను పొందారు. ఆర్‌జీ-1లో 552 మంది, భూపాలపల్లిలో 467మంది బదిలీ వర్కర్లు జనరల్ మజ్దూర్లుగా రెగ్యులరైజ్ అయ్యారు. మందమర్రిలో 310 మంది, అడ్రియాలా లాంగ్ వాల్ ప్రాజెక్టు ఏరియాలో 218 మంది, ఆర్‌జీ-3లో 50మంది, కార్పొరేట్‌లో 25 మంది, మణుగూరులో 19 మంది, ఆర్జీ-3లో 12 మంది, కొత్తగూడెంలో 16 మంది, ఇల్లందు, బెల్లంపల్లిలో తొమ్మిది మంది చొప్పున జనరల్ మజ్దూర్లుగా రెగ్యులరైజ్ అయ్యారు.

కోడ్ ఆఫ్ డిసిప్లిన్, ఇండస్ట్రియల్ రిలేషన్స్‌పై సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న జీఎం లలిత్ కుమార్

గోదావరిఖని, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కోడ్ ఆఫ్ డిసిప్లిన్, ఇండస్ట్రియల్ రిలేషన్స్‌పై గుర్తింపు సంఘం ఏఐటీయూసీతో పారిశ్రామిక సంబంధాలపై ఆర్‌జీ-1 యాజమాన్యం సమావేశం నిర్వహించడం జరిగింది. పర్సనల్ మేనేజర్ డీ కిరణ్ బాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఆర్‌జీ-1 జీఎం డీ లలిత్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నుంచి అధ్యక్షుడు వీ సీతారామాయ్య జనరల్ సెక్రటరీ కే రాజ్ కుమార్, డిప్యూటీ జనరల్ సెక్రెటరీలు ఆరెల్లి పోశం, మడ్డి ఎల్లయ్య, ఇన్‌చార్జి ఎస్ఓటు జీఎం ఆంజనేయ ప్రసాద్ పాల్గొని పారిశ్రామిక సంబంధాల గురించి చర్చించారు. ఈ సందర్భంగా డీ కిరణ్‌బాబు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ ఈ సమావేశం మొదటిసారిగా నిర్వహించడం ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకొన్నదన్నారు. ఉద్యోగుల హక్కులను, సుస్థిరమైన పారిశ్రామిక సంబంధాలను, సంస్థ అభివృద్ధి కోసం కట్టుబడిన నిబద్ధతను గుర్తు చేస్తుందని తెలిపారు. మనం అన్ని విధాలుగా ఒక ఆమోదయోగ్యమైన వాతావరణాన్ని సృష్టించుకోవడం, పరస్పర నమ్మకం పెంచుకోవడం, సామరస్యపూర్వక సంబంధాలను ఏర్పాటు చేయడం ముఖ్యమని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా వర్క్‌ప్లేస్‌లో నిబంధనలు, ప్రమాణాలు, మరియు క్రమశిక్షణ గురించి సమగ్రంగా చర్చించుకొని, ప్రతిఒక్కరూ పాటించే మార్గదర్శకాలను రూపొందించుకోవచ్చన్నారు. ఈ చర్చలు అందరికీ ప్రయోజనకరంగా ఉంటాయని, భవిష్యత్తు ఎదుగుదలకు దోహదపడుతాయని తెలిపారు. కార్యక్రమంలో అన్ని గనులు, డిపార్ట్‌మెంట్ల పిట్ సెక్రటరీలు, యూనియన్ నాయకులు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలపై పోరాటం

యైటింక్లయిన్‌కాలనీ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జనక్‌ప్రసాద్ ఆధ్వర్యంలో ఐఎన్‌టీయూసీ పెండింగ్ సమస్యలపై నిరంతర పోరాటం చేస్తుందని ఐఎన్టీయూసీ సీనియర్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ధర్మపురి అన్నారు. సోమవారం ఓసీపీ-3లో ఎస్అండ్‌డీ సెక్షన్‌లో ఆర్‌జీ-2 వైస్ ప్రెసిడెంట్ కొత్త సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన గేట్ మీటింగ్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇందులో భాగంగానే 35 నుంచి 40 సంవత్సరాల వరకు వయస్సు పరిమితి పెంచడం, లాభాల వాటా గతంలో కంటే రూ.20 వేలు అదనంగా ప్రతి కార్మికునికి ఇప్పించామన్నారు. అలాగే మెడికల్ బోర్డులో అవకతవకలు లేకుండా నిర్వహించేలా కృషి చేస్తున్నామన్నారు. 190 మస్టర్లు, 240 మస్టర్లు నిండిన బదిలీ వర్కర్లను జనరల్ మజ్దూర్లుగా ప్రమోషన్ ఇప్పించడంలో యాజమాన్యంతో మాట్లాడి ఇప్పించామన్నారు. డిప్యూటీ జనరల్ సెక్రటరీ సంపత్‌రెడ్డి, మార్కండేయ, దశరథం, కొంగ రవీందర్, భీమన సత్యనారాయణ, అనంతరాములు, సురేష్, నవీన్ కుమార్ పాల్గొన్నారు.